హైదరాబాద్ వార్త



# నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

-ఉదయం9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఎగ్జామ్
-జిల్లాలో 362 సెంటర్లు ..
74,371 మంది విద్యార్థులు
-3,983మంది ఇన్విజిలేటర్లు..
14 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు
-ప్రతి సెంటర్ వద్ద సిసిటీవి పర్యవేక్షణ



గన్‌ఫౌండ్రీలోని మోడల్ అలియా స్కూల్‌లో ఎగ్జామ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డిఈవో రోహిణి

**హైదరాబాద్, మార్చి 13,ప్రభాతవార్త:** నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 1,433 స్కూళ్లకు చెందిన మొత్తం 74,371 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 37,982 మంది, బాలికలు 36,389 మంది ఉన్నారు. విద్యార్థుల ఎగ్జామ్ కోసం మొత్తం 362 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక సారి ఫెయిల్ అయిన ప్రైవేట్ అభ్యర్థులు 4,094 మంది కూడా ఈ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 362 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 362 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 14 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 3,983 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రశ్నాపత్రాల సీల్డ్ కవర్లను విద్యార్థులకు పంపిణీ చేయడానికి ముందు సీసీటీవీ పర్యవేక్షణలోనే తెరవనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కుర్చీలు-బెంచీలు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు, ఫ్యాన్లు వంటి ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు భద్రతను కూడా కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధించారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్షా సిబ్బంది అధికారులు ఎవరూ కూడా మొబైల్ ఫోన్లు తీసుకురావడానికి అనుమతి లేదు. పరీక్షా కేంద్రాల ప్రవేశ ద్వారాల వద్ద క్లాక్‌రూమ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసి, విద్యార్థులు తమ మొబైల్ ఫోన్లు, పుస్తకాలు ఇతర వస్తువులను భద్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకున్నారు.

# సైబర్ నేరాల కట్టడిలో ప్రజల భాగస్వామ్యం కీలకం : సిపి సజ్జనార్




సైబర్ సింబా వలంటీర్ల ఓరియేంటషన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త** సైబర్ నేరగాళ్ల మాయలో పడి సర్వస్వాన్ని కోల్పోతున్న అమాయకులను కాపాడుకోవాలని, సమాజంలో సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేలా ప్రతి పౌరుడూ చొరవ తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో సైబర్ సింబా వలంటీర్ల ఓరియేంటషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల కట్టడిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత హైదరాబాద్' ప్రచారంలో భాగంగా సైబర్ సింబా అనే వలంటీర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. వాట్సాప్ గ్రూపుల్లో కేవలం 'గుడ్ మార్నింగ్, గుడ్ నైట్' మెసేజ్ లకే పరిమితం కాకుండా, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించే సందేశాలను విరివిగా షేర్ చేయాలని సూచించారు. గతేడాది నవంబర్‌లో ప్రారంభమైన సైబర్ సింబా కార్యక్రమంలో ఇప్పటికే 1,717 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 5,118 డోర్ టుడోర్ కార్యక్రమాల ద్వారా రెండు లక్షల మందికి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారానే ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని చెప్పారు. ప్రస్తుతం డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ పేర్లతో సైబర్ కేటుగాళ్లు రిటైర్డ్ న్యాయమూర్తులు, విద్యావంతులను సైతం మోసం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల యువతులు, మహిళలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరం జరిగిన మొదటి గంటను గోల్డెన్ అవర్‌గా పేర్కొన్న ఆయన, ఆ సమయంలోపు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటి నుంచే ఫిర్యాదు చేసేందుకు సిమిత్ర సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ చైతన్యం వల్లే గతంలో రోజుకు 80 ఉన్న ఫిర్యాదులు ఇప్పుడు 60కి తగ్గాయని, ఇది ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమని వివరించారు. నగరాన్ని సైబర్ క్రైమ్ రహిత నగరంగా మార్చే లక్ష్యంతో సాగుతున్న ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ (క్రైమ్స్ ఎస్.ఐ.టి) ఎం. శ్రీనివాసులు, డీసీపీలు ఎ. అరవింద్ బాబు, ఎస్. చైతన్య కుమార్, జి. చంద్రమోహన్,బి. రాజేష్, లావణ్య నాయక్ జాదవ్ తదితర పోలీస్ ఉన్నతాధికారులతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.

## హిమాయత్ సాగర్‌లో కలుషిత నీటి సరఫరా

- ఆందోళన చేసిన గ్రామ ప్రజలు



కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్న హిమాయత్‌సాగర్ ప్రాంత ప్రజలు

**నార్సింగి, మార్చి 13 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హిమాయత్ సాగర్ గ్రామంలో శుక్రవారం కుళాయిలలో కలుషిత నీరు సరఫరా అయ్యింది. బిందెలు, డబ్బాలలో నీటిని పట్టుకున్న స్థానికులు నీరంతా ఎర్రగా, దుర్వాసనతో రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జల మండలి అధికారులు వెంటనే ఈ కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని, మాకు శుద్ధమైన నీటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న జల మండలి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫిల్టర్‌బెడ్‌ను గురువారం శుభ్రం చేశామని దాని వలన నీరు రంగు మారి ఉండవచ్చని, లేదంటే ఎక్కడైనా వాటర్ పైప్‌లైన్ పగిలిపోయి ఉండవచ్చని, సమస్యను గుర్తించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తామని హామీనిచ్చారు. దీంతో స్థానికులు ఆందోళనను విరమరించారు. మూడు రోజుల క్రితం దర్గా కలిస్కాన్‌లో నేడు హిమాయత్ సాగర్‌లో మంచి నీరు కలుషితం అయ్యిందని, జల మండలి అధికారుల అలసత్వం వల్లనే ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు మండి పడ్డారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఇలా మంచినీరు అపరిశుభ్రం కాలేదని, ఇప్పుడే వరుసగా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వేసవి కాలం అని, నీటి సరఫరాను నిలిపివేస్తే బోర్లు లేని మావంటి పేదల పరిస్థితి ఏమిటని స్థానికులు అధికారులను నిలదీశారు. గ్రేటర్ కన్నా గ్రామ పంచాయతీలే బాగుండేవని హిమాయత్ సాగర్ ప్రజలు పేర్కొన్నారు. పంచాయతీలు ఉన్నప్పుడు సర్పంచ్, వార్డు సభ్యులు వేగంగా స్పందించే వారని, ఇప్పుడు మా సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడితే చర్యలు

-జిల్లా వ్యాప్తంగా 233 కేసులు..381 ఎల్పీజి సిలిండర్లు స్వాధీనం

-చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 13,ప్రభాతవార్త:** ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితుల దృష్ట్యా గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని అరికట్టడానికి గత రెండు రోజుల నుండి జంటనగరాల పరిధిలో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నామని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడుల సందర్భంగా గృహ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న వారిపై అత్యవసర వస్తువుల చట్టం, 1955 లోని సెక్షన్ 6ఏ కింద మొత్తం 233 కేసులు నమోదు చేయబడినవని తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం 381 గృహ ఎల్ పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకోబడినవని పేర్కొన్నారు. అదనంగా, గృహాలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ప్రభుత్వం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఆయిల్ ప్లాంట్ల వద్ద తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని తెలియజేస్తూ, ప్రజలు ఆందోళన చెందవద్దని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## గొప్ప రాజనీతిజ్ఞుడు బహుభాషా కోవిదుడు బూర్గుల రామకృష్ణరావు

-వీరనారి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షురాలు సూర్యాధనుంజయ్



ప్రతిభా పురస్కారంతో నలిమెల భాస్కర్ దంపతులను సత్కరిస్తున్న సూర్యాధనుంజయ్, రమణాచారి, ఉదయవర్లు తదితర అతిథులు

**నాంపల్లి, మార్చి 13 ప్రభాతవార్త :** హైదరాబాద్ రాష్ట్ర ప్రథమ ప్రజాముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణరావు గొప్ప రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు డా. సూర్యాధనుంజయ్,బహుభాషా వేత్త, బహుగ్రంథకర్త డా. నలిమెల భాస్కర్ అన్నారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో భూస్వామ్య స్థితిని తీసివేసి భూములను పేదలకు పంచాలనే గొప్ప మహదాశయం కలిగిన మహానుభావుడు బూర్గుల రామకృష్ణరావు అయితే ఆయన శిష్యుడు భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు దానిని కొనసాగించడం మన తెలుగువారు చేసుకున్న అదృష్టమన్నారు. బూర్గుల రామకృష్ణరావు ప్రతిభా పురస్కారం అందుకుంటున్న డా. నలిమెల భాస్కర్ ఒక గొప్పకవి, రచయిత, బహుభాషా కోవిదుడు, తెలుగుభాషా సాహిత్యలోకంలో వెలుగుజిమ్మే భాస్కరుడని రమణాచారి కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, భాషానిలయం అధ్యక్షుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన బూర్గుల రామకృష్ణరావు జయంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యాధనుంజయ్ విశిష్ట అతిథులు బూర్గుల లక్ష్మీనారాయణరావు, బూర్గుల లక్ష్మీకాంత్, భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లుతో కలిసి బూర్గుల రామకృష్ణరావు చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ప్రముఖ రచయిత, బహుభాషా కోవిదుడు డా. నలిమెల భాస్కర్ దంపతులను ఘనంగా సత్కరించి బూర్గుల రామకృష్ణరావు ప్రతిభా పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాఠశాలస్థాయి విద్యార్థుల వ్యాస రచన పోటీ విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతుల ప్రదానం-పుస్తక ప్రసాదం పథకం లాంఛనంగా ప్రారంభించారు.

## బహదూర్‌పురా జోన్ డిప్యూటీ ఈవోగా సుమన్

-హటాత్తుగా ఈవో మార్పు

**చాంద్రాయణగుట్ట, మార్చి 13, ప్రభాతవార్త :** విద్యాశాఖ హైదరాబాద్ జిల్లా, బహదూర్‌పురా జోన్ ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ ఈవో)గా ఆర్.సుమన్‌ను నియమిస్తూ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న డి.సుకన్య స్థానంలో హిమాయత్‌నగర్ మండలం హైదర్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెయింట్ పీటర్స్ గజిటెడ్ హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న ఆర్.సుమన్‌ను బహదూర్‌పురా జోన్ ఎఫ్ఎసిగా నియమించారు. గత ఫిబ్రవరిలో హైదరాబాద్ జిల్లాలోని 12 జోన్ల డిప్యూటీ ఈవోలను మూకుమ్మడిగా బదిలీ చేస్తూ ఫిబ్రవరి 16న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 19న బహదూర్‌పురా జోన్ డిప్యూటీ ఈవోగా డి.సుకన్య (సైదాబాద్ డిప్యూటీ ఈవో) బాధ్యతలు స్వీకరించారు. సుమారు 23 రోజులు విధులు నిర్వహించారు. అయితే తెల్లవారితే (14వ తేదీ) పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న సమయంలో ఉన్న ఫళంగా డిప్యూటీ ఈవోను మార్చటం చర్చనీయాంశమైయ్యింది. పాతబస్తీలో అత్యంత కీలకమైన బహదూర్‌పురా జోన్ తరచూ వివాదాలలో చిక్కుకుంటుంది. డిప్యూటీ ఈవో సస్పెండ్, ఉన్నఫళంగా మార్చటం వెనుక ప్రైవేటు పాఠశాలల నిర్వాకమేనని ప్రచారం జరుగుతోంది.

# యుద్ధంతో.. 'నై'వేద్యం హరీ..

- నగరంలో ప్రత్యక్షమవుతున్న కట్టెల పొయ్యిలు
- హాస్టళ్లలో, హోటళ్లలో మారుతున్న మెనూలు
- ఆలయాల్లో నైవేద్యాలకు తప్పని కష్టాలు



అమీర్‌పేటలో ఒక హాస్టల్ ముందు కట్టెల పొయ్యిపై వంటకాలు

**జూబ్లీహిల్స్, మార్చి 13, ప్రభాతవార్త:** ఇరాన్ యుద్ధం నగర వాసుల జీవనంపై ప్రభావం చూపుతుంది. ఎక్కడో జరుగుతున్న యుద్ధం కారణంగా నగరవాసుల్లో ఒక్కసారిగా జాగ్రత్త పెరిగిపోయింది. మరోవైపు ఈ ప్రభావం ఆలయాల్లో ప్రసాదాల తయారీపై, అన్నప్రసాదాలపై ప్రత్యక్షంగా చూపుతుంది. దీనికితోడు హాస్టళ్లు, హోటళ్లలో ఫుడ్ మెనూ మారిపోయింది. గ్యాస్ పొయ్యిలు కాస్త చిన్నబోయి కట్టెల పొయ్యిలు నగరంలో ప్రత్యక్షమయ్యాయి. ఇక ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ఇండక్షన్ స్టౌలు స్టాక్ లేవంటూ బోర్డులు ప్రత్యక్షమవుతున్నాయి. సీఎన్జీ కోసం వాహనాలు సైతం పెట్రోల్ పంపుల వద్ద బారులు తీరుతున్నాయి. ఒక వైపు ప్రభుత్వం గ్యాస్ ఇంధన సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని తేల్చిచెబుతున్నా క్షేత్రస్థాయిలో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తుంది.

### తయారీకి యుద్ధమే..

నగరంలో నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేసే ఆలయాలున్నాయి. జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం, చిలుకూరు బాలాజీ దేవాలయం, బిర్లా మందిర్, జగన్నాథ్ దేవాలయం, హరేకృష్ణ దేవాలయం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, కర్మాన్‌ఘట్ హనుమాన్ దేవాలయం, దిల్‌సుఖ్‌నగర్ అష్టలక్ష్మి దేవాలయం, సాయిబాబా దేవాలయం, కీసరగుట్ట ఇలా పలు ఆలయాలు కొలువుదీరి ఉన్నాయి. సాధారణ రోజుల్లో మూడు అంకెల్లో ఉండే భక్తులు వారాంతాల్లో ప్రత్యేక రోజుల్లో నాలుగు అంకెలను దాటుతున్నారు. గ్యాస్ ఇబ్బందుల నేపథ్యంలో ప్రసాదాల తయారీలో ఆలయాలు చాలా జాగ్రత్తలు వహిస్తున్నాయి. గ్యాస్ కొరత తలెత్తితే తాము ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాదాన్ని నిలిపివేయాల్సి వస్తుందని, అలాగే ప్రసాదాల తయారీని తగ్గించినట్లు పశ్చిమ మండల పరిధిలో ఉన్న ఒక ప్రధాన గుడి పరిపాలనాధికారి వివరించారు. ఇక ప్రస్తుతానికి వేలాది మంది భక్తులకు సరిపడా ఏర్పాట్లు చేసి ఉన్నప్పటికి ముందు సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు మరో ప్రముక ఆలయ ఈఓ వివరించారు. బాయిలర్లకు కట్టెల సాయాన్ని తీసుకుంటానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఇవే కాదు.. ఇప్పుడు చాలా ఆలయాల్లో ఇదే పరిస్థితి ఉంది. నైవేద్య తయారికి గ్యాస్ సమస్య చాలా మేర ఆలయాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. పెద్ద ఆలయాల్లో ప్రతి రోజు దాదాపుగా భక్తుల సంఖ్యకు అనుగుణంగా దాదాపు 250 కిలోలకుపైగా పులిహోర, 150 కిలోలకు పైగా దద్దోజనం, 80 కిలోలకు పైగా పొంగలి, దాదాపు వేయికిపైగా లడ్డూలు తయారు చేయాల్సి ఉంటుందని ఒక ఆలయ నిర్వాహకుడు తెలిపారు. ఇందుకోసం ఆలయ వంటశాలలో పెద్దమొత్తంలో వాణిజ్య గ్యాస్‌ను వినియోగిస్తామన్నారు. గ్యాస్ కొరత నేపథ్యంలో నైవేద్య తయారీలో కోత పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

### మారుతున్న మెనూ..

హాస్టళ్లలో, హోటళ్లలో చాలా వరకు మెనూ మారిపోయింది. గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్సార్ నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లోని హాస్టల్ నిర్వాహకులు కట్టెల పొయ్యిలను సిద్ధం చేసి వాటి మీదనే వంటలు వండుతున్నారు. నగరంలో ఇలా హాస్టళ్ల ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు చిన్న హోటళ్లకు అవసరమైన గ్యాస్ లేకపోవడంతో హోటళ్లను మూసివేశారు. బ్యాచిలర్ల బాధలు మరోలా ఉన్నాయి. కర్రీ పాయింట్లు సైతం చాలా వరకు మూతపడ్డాయి. కొందరు నిర్వాహకులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇక ఇప్పుడు ఇళ్ల నుంచి మొదలుకొని హాస్టళ్లలో చాలా మంది ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లవైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా ఇండక్షన్ కుక్కర్లపై వంటకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇండక్షన్ స్టౌలు సైతం స్టాకు లేవంటే బోర్డులు పెడుతున్నారు. నగరంలో ఒకటి, రెండు రోజుల్లో దాదాపు 17వేలకు పైగా ఇండక్షన్ స్టౌలు విక్రయించినట్లు ఒక సంస్థ డీలర్ తెలిపారు. హోటళ్లలో సైతం చాలా వరకు స్టౌపై వండాల్సిన వంటకాలకు స్వస్తి పలుకుతున్నారు. చిన్నచిన్న వంటకాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఇప్పుడు కట్టెలకు సైతం మంచి గిరాకి ఏర్పడింది. ఇక నగరంలో సీఎన్జీ స్టేషన్ల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. వాహనదారుల్లో ఉన్న అనుమానాలతో గ్యాస్ లభించదనే భయంతో ముందుగానే గ్యాస్ స్టేషన్ల వద్దకు వచ్చి బారులు తీరుతున్నారు.

# ఆహార కల్తీపై పోలీసుల దాడులు...హోటళ్లపై కేసులు నమోదు



**అత్తాపూర్, మార్చి 13,ప్రభాతవార్త :** అత్తాపూర్ పరిధిలో కల్తీ ఆహారం విక్రయిస్తున్న మూడు హోటళ్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పాడైపోయిన మరియు నిల్వ చేసి ఉంచిన ఆహార పదార్థాలు బయటపడినట్లు పోలీసులు తెలిపారు. పిల్లర్ నం.127 వద్ద ఉన్న మొఘల్ బావార్చి హోటల్ లో తనిఖీలు నిర్వహించగా చికెన్ గ్రేవీ, చికెన్,మటన్ మరియు కట్ చేసిన కూరగాయలను ప్లాస్టిక్ బకెట్లు,స్టీల్ పాత్రల్లో పెట్టి డీప్ ఫ్రీజర్‌లో అస్వచ్ఛంగా నిల్వ చేసినట్లు గుర్తించారు.కొన్ని ఆహార పదార్థాలు పాడైపోయి,భూజు పట్టిన స్థితిలో ఉన్నట్లు తెలిసింది. హోటల్‌లో ఎలుకలు,పిల్లులు సంచరిస్తుండటం కూడా గమనించారు.ఈ కేసులో హోటల్ యజమాని సయ్యద్ కలీమ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్.ఎం.గూడాలో ఉన్న బాలాజీ ధాబా టైటానియంలో తనిఖీలు చేయగా క్యారెట్,బీన్స్, కాలిఫ్లవర్,వెల్లుల్లి, మష్రూమ్ వంటి కూరగాయలను ప్లాస్టిక్ బకెట్లలో అస్వచ్ఛంగా నిల్వ చేసి ఉంచినట్లు గుర్తించారు.చాలా పదార్థాలు పాడైపోయిన స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో హోటల్ యజమాని అశోక్ సైనీపై కేసు నమోదు చేశారు.ఎం.ఎం.పహాడీ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న షాహీ కళ్యాణి బిర్యానీ హోటల్‌లో తనిఖీలు చేయగా చికెన్65 మసాలా, బీఫ్,పుదీనా చట్నీ, మైదా పిండిని ప్లాస్టిక్ బకెట్లలో పెట్టి డీప్ ఫ్రీజర్‌లో అస్వచ్ఛంగా నిల్వ చేసినట్లు బయటపడింది. వాటిలో కొన్ని పదార్థాలు పాడైపోయినట్లు కూడా గుర్తించారు. ఈ కేసులో యజమాని మొహమ్మద్ తాహెర్ ఖురేషీపై కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ హోటళ్లలో పాడైపోయిన మరియు అనారోగ్యానికి కారణమయ్యే ఆహారాన్ని తాజాగా ఉందని చెప్పి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా ఆహారం నిల్వ చేసి విక్రయించినందుకు సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చందానగర్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

-మంటల్లో దగ్ధమైన అనుపర్నిచర్ షోరూం



మంటల్లో దగ్ధమవుతున్న అనుపర్నిచర్

**శేరిలింగంపల్లి,,మార్చి 13 ప్రభాతవార్త** చందానగర్‌లోని ముంబై జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఓ పర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక అను పర్నిచర్ అండ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో భారీ మంటలు చెలరేగాయి.పర్నిచర్ దుకాణం కావడంతో క్షణాల్లోనే మంటలు అంటుకుని మంటల్లో పూర్తిగా భవనం దగ్ధమయ్యింది. జాతీయ రహదారిపై భారీస్థాయిలో మంటలు ఎగసిపడటంతో అటువైపుగా వెళుతున్న ప్రయాణికులు భయభ్రాంతులకు గుర య్యారు. వివరాలలోనికి వెళితే.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ జాతీ య రహదారికి అనుకుని పోలీస్‌స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న అనుపర్నిచర్‌లో అర్థరాత్రి అకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరిగింది.లోపలి నుంచి బయటకు అగ్నికీలలు, పొగలు ఎగసిపడటంతో అది గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బంది కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఫైర్ సిబ్బంది సహకారంతో మంటలను ఆర్పివేసే పయత్నం చేశారు. అను పర్నిచర్ భవనం 5 అంతస్తులకు మంటలు వ్యాపించాయి. కాగా అప్పటికే షాప్ మూసివేసి ఉండటంతో లోపల మనుషులు ఎవ్వరు లేరని,వర్కింగ్ వేళల్లో ప్రమాదం జరిగి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి గురైన అను పర్నిచర్ భవనం ప్రధాన జాతీయ రహదారికి అనుకుని ఉండటంతో భారీగా ట్రాఫిక్ స్థంబించింది. అగ్నిప్రమాదంలో భారీగా ఆస్థినష్టం మినహా ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదని బాలానగర్ ఏసీపీ తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్లు అను పర్నిచర్ షోరూం యజమానిరమణారెడ్డి చెబుతున్నారు. కాగా ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు




ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

**ముషీరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఇందిరాపార్క్ చౌరస్తా, ధర్నాచౌక్ ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. శుక్రవారం మధ్యాహ్నం జీహెచ్ఎంసీ అధికారులు, ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు సాగిస్తున్న వారిని ఖాళీచేయించి, తాత్కాలికంగా వారు ఏర్పాటుచేసుకున్న దుకాణాలను జేసీబీ సాయంతో తీసివేశారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు చేసి, వ్యాపారాలు సాగించటం వల్ల పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు కూడా తీవ్రంగా అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అశోక్‌నగర్ నాలా మరమ్మత్తు కారణంగా ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా శుక్రవారం నుంచి వాహనాలు అధికంగా ఇదే మార్గంలో వెళ్లాల్సి రావటంతో, పై అధికారుల ఆదేశాల మేరకు రోడ్డుపై ఎటువంటి అడ్డంకులు లేకుండా, వాహనాలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కిష్టయ్య మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

**-నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు**



పాడైన రోడ్లు

**నిజాంపేట్, మార్చి 13, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారులన్నింటిని తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతూ నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే రోడ్ల మరమ్మతులు చేపట్టారని, మిగతా ప్రాంతాల్లో ఇంకా పనులు ప్రారంభించాల్సి ఉందని అకుల సతీష్ టీమ్ కోరుతూ శుక్రవారం నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు సమర్పించారు. అదేవిధంగా ప్రాంతంలో తీవ్రంగా పెరుగుతున్న దోమల సమస్యపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ఉన్న ఐదు చెరువుల్లో పెరిగిన గుర్రపు డెక్క కారణంగా దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల ఆ చెరువుల్లో గుర్రపు డెక్క నిర్మూలన కోసం ప్రత్యేక స్ప్రే చేయాలని అధికారులను కోరారు. అలాగే జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం ప్రతి వారానికి ఒకసారి దోమల ఫాగింగ్ నిర్వహించాలని, తద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి ప్రజలను రక్షించవచ్చని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, రహదారి సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రై డే



డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

**నిజాంపేట్, మార్చి 13, ప్రభాతవార్త**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 8వ రోజు సర్కిల్ 58 పరిధిలో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన ప్రిపరేటరీ పనులు, ఫ్రైడే డ్రై డే దోమల నియంత్రణ అవగాహన కార్యక్రమం, పరిశుభ్రత కార్యక్రమాలు డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానాలు, కమ్యూనిటీ హాళ్లు, మున్సిపల్ కాంప్లెక్స్‌లు, పబ్లిక్ పార్కులలో ప్రత్యేక శుభ్రత పనులు చేపట్టి వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ (ట్రెయినీ) సర్కిల్ 58లోని నిజాంపేట్ ప్రాంతాన్ని సందర్శించి ఫ్రైడే డ్రై డే దోమల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే డి ఆర్ సి సెంటర్‌ను పరిశీలించి, పార్కులు, సరస్సులు, రోడ్లు, సెంట్రల్ మీడియన్ల నిర్వహణతో పాటు చేపట్టిన శుభ్రత పనులను సమీక్షించారు.

### మంచి నీటి సమస్యను పరిష్కరించండి : మాజీ కార్పొరేటర్



ఎండికి వినతి పత్రం అందిస్తున్న మాజీ కార్పొరేటం

**అల్వాల్, మార్చి 13 ప్రభాతవార్త:** మంచి నీరు, డ్రైనేజీ సమస్యలకు సంబంధించిన పలు అంశాలుపై అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డితో చర్చించారు. ఎండిని ఆయన కార్యాలయంలో కలిసిన మాజీ కార్పొరేటర్ సంపతి చిత్తారయ్య కాలనీ, బండ బస్తీ తదితర ప్రాంతాలులోని మంచి నీటి పైపు లైన్లు ఏర్పాటు, డ్రైనేజీ తదితర వసతులను కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామని ఎండి హామీ ఇచ్చారని శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## బాగ్ అంబర్‌పేటలో రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న వి.హనుమంతరావు

**హైదరాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో శుక్రవారం బాగ్ అంబర్‌పేట కంటెసెంట్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్‌జ డాక్టర్ రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ ఒక పెద్ద పండుగ అని , ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రోహిన్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి రంజాన్ కిట్లను అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలుక సమన్యాయం చేసే విధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇందులో భాగంగానే నేడు బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బడే మజీద్‌లో ఈరంజాన్ తోఫా కార్య క్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు, సోదరిమణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్-ప్రెసిడెంట్ అప్సర్ యూసఫ్ జహీ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- వల్లభనేని అనిల్‌కుమార్**



ప్రమాణస్వీకారం చేసిన అనిల్‌కుమార్ ప్యానెల్ సభ్యులు

**జూబ్లీహిల్స్, మార్చి 12, ప్రభాతవార్త:** సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు వల్లభనేని అనీల్ అన్నారు. ఇటీవల జూనియర్ ఆర్టిస్ట్ ఎన్నికల్లో వల్లభనేని అనీల్ ప్యానెల్ విజయం సాధించారు. ఈ మేరకు ఇందిరానగర్‌లోని తెలుగు సినీ, టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ కార్యాలయంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఛైర్మన్‌గా స్వామిగౌడ్, కార్యదర్శిగా రవి, కోశాధికారిగా రవీందర్‌లతో కలిసి వల్లభనేని అనీల్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. సినీ కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉ న్నాయని, వాటిని స్థానిక దశలవారీగా పరిష్కరించుకుంటామన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బిసిలకు 50 వేల కోట్లు కేటాయించాలి



అభివాదం చేస్తున్న బిసి నేతలు

**సైఫాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌లపై పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు వద్దని తమిళనాడు రాష్ట్రం తరహాలో 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని, అలాగే బిసిలపై రోజురోజు దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్న నేపథ్యంతో బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావాలని వారు కోరారు. ఫోరం, ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'పార్లమెంట్-శాసన సభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బిసి బిల్లులపై' చర్చా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిసిలకు 50 వేల కోట్లు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న బిసి విద్యార్థుల ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, బిసి కార్పొరేషన్, బిసి కులాల కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని, బిసిలపై ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని, ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో బిసి కులగణన చేపట్టాలని కోరారు. లేని పక్షంలో బిసి లోకం తగిన గుణపాఠం చెపుతుందని హెచ్చరించారు. ఈ చర్చా కార్యక్రమానికి భైరీ శేఖర్ అధ్యక్షత వహించగా, నాయకులు అయిలి వెంకన్న గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, ఎలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, భత్తిని కీర్తిలత పాల్గొన్నారు.

## చార్మినార్ ప్రాంతాలలో పరిశుభ్రత ఏర్పాట్లను పరిశీలించిన జిహెచ్ఎంసి అధికారులు



చార్మినార్ పరిసర ప్రాంతాలలో పర్యటిస్తున్న జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ ఎస్.రవి కిరణ్

**చార్మినార్, మార్చి 13 ప్రభాతవార్త :** రంజాన్ మాసంలోని నాలుగువ శుక్రవారం సందర్భంగా శనివారం జిహెచ్ఎంసి (శానిటేషన్)అదనపు కమిషనర్ ఎస్.రవి కిరణ్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట్ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు అధికారులు మక్కామసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత ఏర్పాట్లను పరిశీలించారు .చెత్త తొలగింపు, తాత్కాలికడస్ట్ బిన్ల ఏర్పాటు, మక్కామసీదుకు ప్రార్ధనలు కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ తీసుకోవల సిన పలు అంశాలపై స్థానిక అధికారులతో సమీక్షించా రు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏ ర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాల న ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎనిమిదివ రోజు ఫైర్ సేఫ్టీ లేని భవనాల పరిశీలన డ్రెవ్ చేపట్టామ ని, సంతోష్‌నగర్‌లో మూడు, యాకుత్‌పురలో మూడు, మలక్‌పేట్‌లో ఎనిమిది, చార్మినార్‌లో పన్నెండు, మూసా రాంబాగ్‌లో ఎనిమిది మొత్తం 34 భవనాలను గుర్తించా మని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఫైర్ సేఫ్టీ లేకుండ కొనసా గుతున్న వాణిజ్య సముదాయా లకు త్వరలో నేటీసులు జారీ చేయనున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సన్నావుద్దీన్, శానిటేషన్ విభా గం డిఈ శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రముఖ వైద్యులకు డా. స్వయంప్రకాష్ స్మారక పురస్కారాల ప్రధానం



డా. ప్రకాష్ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులర్పిస్తున్న డా. సత్యం, రామలక్ష్మి తదితర స్మారక పురస్కార స్వీకర్తలు

**రవీంద్రభారతి, మార్చి 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో డాక్టర్ కంభంపాటి స్వయంప్రకాష్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో విశ్వవిఖ్యాత ఆయుర్వేద వైద్యుడు డా. స్వయంప్రకాష్ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సనాతన ఎంటర్ప్రెన్యూర్స్ అసోసియేషన్ డా. సత్యం శ్రీరంగం ఆత్మీయ అతిథులతో కలిసి ప్రకాష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడుతూ దేశంలో సంతా నంలేమి సమస్యతో బాధపడుతున్న ఎందరో యువ దంపతులకు ఆయుర్వేద వైద్యంతో సంతానభాగ్యం కలిగించిన స్వయంప్రకాష్ గొప్ప మేధోసంపత్తిగల మంచి పేరుగాంచిన వైద్యుడని కొనియాడారు. ఈ సందర్భంగా వివిధరంగాలకు చెందిన ప్రముఖులు ఆర్థోపెడిక్ వైద్యుడు సాయి చంద్ర మల్లాది; హోమియోపతి వైద్యుడు సాత్విక్ భరద్వాజ సామాజిక సేవావేత్త గిరిప్రసాద్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, రమాదేవిలను ఘనంగా సత్కరించి డా. స్వయంప్రకాష్ స్మారక పురస్కారాలు ప్రదానం చేసి వారు సమాజానికి చేస్తున్న సేవలను మరింతగా కొనసాగించాలని కోరారు. చివరి కంభంపాటి రామలక్ష్మి నివేదికను సమర్పించారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు




శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన నల్లకుంట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. మారుతి ప్రసాద్

**చిక్కడపల్లి మార్చి 13 (ప్రభాతవార్త ) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నల్లకుంట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ విందులో ప్రముఖ సామాజిక కార్యకర్త సయ్యద్ ఖాజాతో పాటు బియర్ ఎస్ సీనియర్ నేత మహమ్మద్ ఖదీర్, సయ్యద్ అస్లాం, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ ఫిరోజ్, అహ్మద్ దాన్, ఎండి అబ్బు, సయ్యద్ యూనస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ఎ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ పండుగలు సోదరభావాన్ని, ఐక్యతను చాటిచెబుతాయని, అందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విందులో పాల్గొన్న వారు ఎస్‌హెచ్ఓకు మరియు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

### జెసిని సత్కరించిన మురళీమోహన్ రాజు



జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి మార్చి 13 ( ప్రభాతవార్త ) :** సావిత్రిబాయి పూలే వర్ధంతి, అంతర్జాతీయ మహిళా దినోత్స వాలను పురస్కరించుకుని శుక్రవారం జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఆయన ఛాంబర్‌లో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ , అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్, ప్రముఖ రచయిత కె.మురళీమోహన్ రాజు, విశ్రాంత ఉప కార్మిక కమిషనర్ డాక్టర్ రాచపాలెం రఘు కలిసి జేసీని ఆత్మీయంగా సత్కరించారు. ఆయనకు జ్ఞాపికను అందజేసి, శాలువాతో గౌరవించారు. సావిత్రిబాయి పూ లే ఆశయాలు, అవయవ దానంపై సమాజంలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా వారు చర్చించారు.

### మతసామరస్యాలకు ప్రతీకలుగా ఇఫ్తార్ విందులు



**యూసుఫ్‌గూడ, మార్చి 13, ప్రభాతవార్త :** మత సామరస్యా లకు ఇఫ్తార్ విందు లు ప్రతీకలుగా ని లు స్తాయని జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాగంటి సునీత అన్నారు. రహమత్‌నగర్ గాంధీ బొమ్మ ప్రాంతంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు చిన్న రమేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో మైనారిటీ సోదరులతో పాటు మాగంటి సునీత పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ సుభాకాంక్షలు తెలిపారు.

## జీవితంలో విద్యార్థి దశ కీలకం

**-డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా**



విశేషంగా ఆకట్టుకున్న గణనాయక నృత్య ప్రదర్శనలో చిన్నారులు, ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, మార్చి 13, ప్రభాతవార్త :** జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉత్తములుగా ఎదగాలని బండ్లగూడ మండలం-1, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డాక్టర్ జి.విశ్వనాథం గుప్తా అన్నారు. శుక్రవారం గౌలిపురా-లలితాబాగ్ రోడ్డులోని బేరూన్ గౌలిపురా ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో చదువు ఒక్కటే అన్నింటికి దారి చూపుతుందన్నారు. కష్టపడి చదివిన వారికి భవిష్యత్ ఉత్తమంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రమాదవి, ఉపాధ్యాయులు జె.నందినీ కుమారి, కె.వీణ, పి.శశికళ, కొలనుపాక శివప్రసాద్, పి.వెంకటరమణ, జె.పావని, కె.హేమలత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అంజలి, సంధ్య, మంజుల, అనిరుధరావు, మధుసూదన్‌రావు, నవనీత, శ్రీదేవి, ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

### సిసి రోడ్డు పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్



సత్యఎన్‌క్లేవ్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, మార్చి 13 ప్రభాతవార్త**

చందానగర్ డివిజన్ పరిధిలోని సత్యఎన్‌క్లేవ్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను చందానగర్ మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా రోడ్ల నిర్మాణం ఉండాలని మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కాలనీ వాసులు సీసీరోడ్డు పనులను ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ శ్రీజను మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డీ గౌసుద్దీన్, తదితరులు

## బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి




సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి. చిత్రంలో పుట్ట లక్ష్మణ్ తదితరులు

**సైఫాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** విద్యార్థుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం అన్యాయమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించడంతోపాటు విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 12 ఏళ్ళు అవుతున్నప్పటికి విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే విద్యా శాఖకు మంత్రి లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. తక్షణమే విద్యా శాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రతి సమావేశంలో ఉచితంగా విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని ప్రకటిస్తున్నారే కాని అమలు చేయడం లేదని విమర్శించారు. విద్యా రంగం బలోపేతానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

**విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలి : ఎబివిపి**

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని ఎబివిపి ఆరోపించింది. పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యను కొనసాగించడానికి ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎబివిపి నాయకులు విక్రమాదిత్య, సురేందర్ డిమాండ్ చేశారు. ఇటీవల విద్యా మిషన్ ఛైర్మన్ చేసి వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.

## ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

**దుండిగల్, మార్చి 13, ప్రభాతవార్త**

మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్‌ను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేటలోని లహరి గ్రీన్ పార్క్ నందు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వివిధ విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్ నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని తద్వారా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంజీరా వాటర్ పైప్ లైన్ సదుపాయాన్ని కల్పించడంతోపాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మరింత అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్‌లోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించామని, రానున్న రోజుల్లో మరిన్నీ మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, లహరి గ్రీన్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ వెలగపూడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### యుపిహెచ్‌సికి శాశ్వత భవనం కేటాయించండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న డాక్టర్ నురీన్ బేగం

**అల్వాల్, మార్చి 13 ప్రభాతవార్త:**

అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శాశ్వత భవనం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సుభాష్‌నగర్‌కు చెందిన యుపిహెచ్ఎస్‌కు చెందిన వైద్యురాలు నురీన్ బేగం ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. హెల్త్ సెంటర్ నిర్వహణ కష్ట తరంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. శాశ్వత భవనం ద్వారా రోగులకు సమర్ధవంతమైన సేవలు అందించగలుగుతామని స్పష్టం చేశారు. శాశ్వత భవనం కోసం కచ్చితంగా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత అనీల్ కిషోర్, వీరేశ్, సదానంద్, ప్రభాకర్, మనోజ్, మమత తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనడానికి ఉన్నత విద్య అవసరం**

**ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం విద్యార్థులకు సూచన**

**సైఫాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** 'ఇన్నోవేటివ్ టీచింగ్, రిసెర్చ్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్' అనే అంశంపై రెండు రోజు పాటు జాతీయ సెమినార్ నిజాం కళాశాలలో విజయవంతంగా కొనసాగింది. ఈ సదస్సులో తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రపంచ సవాళ్ళను, పోటీ ప్రపంచం యొక్క డిమాండ్లను ఎదుర్కొనడానికి ఉన్నత విద్యలో పాఠ్యాంశ సంస్కరణల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అంకితాభావం, ఆవిష్కరణ, కృషి ద్వారా విద్యా నైపుణ్యం కోసం కృషి చేయడానికి నిజాం కళాశాల గొప్ప వారసత్వాన్ని నిలబెట్టడానికి విద్యార్థులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.శ్రీనివాస్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎ.లక్ష్మి, ప్రొఫెస్ వి.వెంకటరమణ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి ప్రొఫెసర్ ఆనంద్‌పవార్, కో-ఆర్డినేటర్ డా.హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మజీద్‌లో రంజాన్ తోఫా పంపిణి



రంజాన్ తోఫా పంపిణి చేస్తున్న కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండువను పురస్కరించుకుని శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక డివిజన్ లోగల ఆంజుమన్ మజీద్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణి కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలను కలుసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : మురళీమోహన్




ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ మురళీమోహన్.

**మెహిదీపట్నం, మార్చి 13, ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఇన్ కమ్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. మురళీమో హన్ అన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ఇన్ కమ్ టాక్స్ శాఖ అధికారులు మాసబ్ ట్యాంక్ జేఎన్టీయూ ఫై న్ ఆర్ట్స్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మురళీ మోహన్ ఇన్ కమ్ టాక్స్ కమిషనర్ విష్ణుప్రియలు పాల్గొని మాట్లాడారు...పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు పి.వెంకట్, డి.రవిప్రసాద్, ఎస్. సోమస్కర్, జె.శ్యామ్ సుందర్, టి.డేవిడ్, వై.నరహరి, ఎం.ప్రశాంత్, దుద్దు ధినేష్ కుమార్, కో ఆర్డినేటర్ జెస్సీ, ఇన్కమ్ టాక్స్ వెరిఫికేషన్ యూనిట్-1 ఉద్యోగులు, ఏఎస్ఈ జెడ్ ఎన్జీవో సభ్యులు, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ లీకేజీ,నీటి కలుషితంపై జిఎంకు వినతి



వాటర్ వర్క్స్ జిఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న షేక్ గౌస్, అభిషేక్ అడపా.

**బేగంపేట మార్చి 13, ప్రభాతవార్త**

బేగంపేట పాటిగడ్డ ఎంఎంటీఎస్ స్టేషన్ సమీపంలో డ్రైనేజీ సమస్యతో పాటు తాగునీరు కలుషితమవుతున్న సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై బేగంపేట కాంగ్రెస్ నేతలు షేక్ గౌస్, అభిషేక్ అడపాలు వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఈ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు జీఎం కు వివరించారు. వారి విజ్ఞప్తి మేరకు పాటిగడ్డ సమస్య ఉన్న ప్రాంతంలో జీఎం పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెల్సుకున్నారు. సమస్యను సంబంధిత అధికారులకు వివరించి శాశ్విత సమస్యకు చర్యలు చేపట్టాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు షరీఫ్, రఫీక్, అజీం, తాహెర్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించాలి:ఎబివిపి**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలు.

**బేగంపేట మార్చి 13, ప్రభాతవార్త**

ఈ నెల 20 న ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సికింద్రాబాద్ జిల్లా బేగంపేట నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్కబాలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సి న పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువును కొనసాగించడంలో తీవ్ర కష్టాలు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ పుండరీక్, వెంకట్, హర్ష, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

### కవయిత్రిమొల్లమాంబ సాహిత్యసేవలు ఎనలేనివి : వెంకట్రావు



కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రేటర్ హైదరాబాద్ శాలివాహన కుమ్మర సంఘం నేతలు

**శేరిలింగంపల్లి, మార్చి 13 ప్రభాతవార్త**

కవయిత్రి మొల్లమాంబ సాహిత్యసేవలు ఎనలేనివని, వాల్మికి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని తెలుగులో అనువదించిన సాహిత్యదిగ్గజమని గ్రేటర్ హైదరాబాద్ శాలివాహన కుమ్మర సంఘం శేరిలింగంపల్లి జోన్ ఛైర్మన్ ఉరిటి వెంకట్రావు అన్నారు. తెలుగు సాహిత్యంలో తొలి మహిళా కవయిత్రిగా పేరొందిన ఆతుకూరి మొల్ల జయంతిని పురస్కరించుకని చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం ప్రాంగణంలో గ్రేటర్ హైదరాబాద్ శాలివాహన కుమ్మర సంఘం శేరిలింగంపల్లి, పటాన్‌చెరు జోనల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరిటి వెంకట్రావు మాట్లాడుతూ. శ్రీకృష్ణదేవరాయల కాలంలో కవయిత్రి మొల్ల చేసిన సాహిత్య సేవలు అనిర్వచనీయమన్నారు. ముఖ్యంగా వాల్మికి సంస్కృతంలో రచించిన 24వేల పద్యాలతో కూడిన రామాయణాన్ని ఆరు కాండాలలో 871 పద్యాలతో ఐదు రోజుల్లోనే తెలుగు కావ్యంగా రచించి మహాకవయిత్రిగా కీర్తికెక్కినదని కొనియాడారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ పావని, గ్రేటర్ హైదరాబాద్ శాలివాహన కుమ్మర సంఘం వైస్ ఛైర్మన్ పెద్దపూడి శ్రీనివాసు, అద్యక్షులు పులివర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎన్. రమణయ్య, ప్రధాన కార్యదర్శి ఎం. అంకమరావు, ఎన్. నరసింహారావు, కోశాదికారి మోదుకూరి శ్రీనివాసరావు, బోసుబాబు, జైపాల్, మహేశ్, జితేందర్ పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన చికోటి ప్రవీణ్



రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానిస్తున్న చికోటి ప్రవీణ్

**సైదాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు, హిందు ధర్మరక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చికోటి ప్రవీణ్ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ధన్యావాదాలు తెలిపారు.

**అమరవాది లక్ష్మీనారాయణను భారీ మెజార్టీతో గెలిపించండి**

**సైదాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** ఈ నెల 17వ తేదీన జరిగే తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడి ఎన్నికల్లో అమరవాది లక్ష్మీనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్ గుప్త, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తలు కోరారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత తెలంగాణాకు 40 శాతం మహాసభ ఆస్తులు దక్కించుకునే విధంగా కృషి చేసిన ఏకైక వ్యక్తి అమరవాది లక్ష్మీనారాయణ అని వారు పేర్కొన్నారు. మహాసభ ఆస్తులను కాపాడుతూ అందరికి న్యాయం చేస్తూ, మచ్చలేని నాయకుడిగా ఉన్న అమరవాదికి లక్ష్మీనారాయణకు రాష్ట్రంలోని మహాసభ కౌన్సిల్ మెంబర్లు, మాజీ అధ్యక్షులు, మాజీ ప్రధాన కార్యదర్శులతో పాటు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్వార్ధ రాజకీయం చేస్తున్న వారికి అమరవాది గెలుపుతో తగిన బుద్ధి చెప్పాలని వారు కోరారు.

## సీతారామ కళ్యాణానికి దేవాలయం ముస్తాబు



రామాలయం ముఖద్వారం

**ఎల్.బి.నగర్, మార్చి 13 ప్రభాతవార్త:** శ్రీసీతారామ కళ్యాణం మహోత్సవానికి రామాలయం ముస్తాబయింది. చైతన్యపురి లోని శ్రీరామాలయం ప్రాంగణంలో ఈనెల 27వ తేదీన 52వ శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయం నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవంలో భాగంగా రామాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## దోమల నివారణకు సహకరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 13 ప్రభాతవార్త:**

దోమల నివారణ చర్యల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాగోల్ డివిజన్ భారస పార్టీ యువ నాయకులు పీ.ఎం.ఆర్. రాజు(పోచంపల్లి రాజేందర్‌రెడ్డి) తన స్వంత నిధులతో రెండు ఫాగింగ్ మిషిన్లు కొనుగోలు చేసి దోమల నివారణ కోసం పరిశుద్ధ విభాగానికి అప్పగించారు. ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయడం పట్ల రాజును ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలపై దండయాత్ర చేపట్టామని, ప్రజలు చైతన్యవంతులై సహకరించాలని కోరారు. గత భారస హయాంలో మేము తమవంతుగా కొన్ని దోమల పాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశామన్నారు. దోమల కారణంగా ప్రాణసంకటమైన జ్వరాలు వస్తాయని, వైద్యం కోసం లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని, దోమలను నివారించగలిగితే ఇంటిల్లిపాది ఆనందంగా ఉంటారన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలని కోరారు. నాగోల్ చెరువులో ఉన్న గుఱ్ఱపుడెక్క ఆకును తొలగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీతప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజారెడ్డి, పిఎంఆర్ రాజు, తూర్పాటి చిరంజీవి, సతీశ్‌యాదవ్, సీతారాములు, చిత్రాల జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, వినోద్ పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ తప్పుడు నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలి : ఎబివిపి



రామంతాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ కిరణ్, జిల్లా కన్వీనర్ బుర్ర అఖిల్, సంతోష్ తదితరులు

**రామంతాపూర్, మార్చి 13 ప్రభాతవార్త :**

తెలంగాణలో అమలు చేస్తున్న నూతన విద్యావిధానం విద్యార్థుల జీవితాలపై యమపాశంగా మారిందని పలువురు ఎబివిపి నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామ్ కిరణ్, జిల్లా కన్వీనర్ బుర్ర అఖిల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్, రామంతాపూర్ నగర కార్యదర్శి భాను, గ్రేటర్ టెక్నికల్ సెల్ కో కన్వీనర్ సిద్ధు, అఖిల్, వర్ధన్, మనోజ్, రంజిత్ తదితరులు మాట్లాడుతూ కొద్ది రోజల క్రితం ఆకునూరి మురళి నేతృత్వంలో, చారకొండ వెంకటేష్ మెంబర్లుగా తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని, విద్యార్థులు అనేక సమస్యల వలలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఇక నుంచి చెల్లించబోమని, పాలిటెక్నిక్ కళాశాల ల్యాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. విద్యా కమిషన్ తప్పుడు నిర్ణయాలు తీసుకుందని, ప్రభుత్వ స్కూల్ ఎత్తి వేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు ఎబివిపి నేతలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు : ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ఉప్పల్, మార్చి 13 ప్రభాతవార్త :**

పారిశుధ్య నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చేయవద్దని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాపాలన,ప్రభుత్వ ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఉప్పల్ భగాయత్, రామంతాపూర్ ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ భగాయత్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలోని తనిఖీ నిర్వహించి, సంబంధిత డిప్యూటి ఇంజనీర్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భగాయత్‌లో చెత్తా చెదారం లేకుండా చూడాలని, శిధిలాలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నిర్మాణ శిధిలాలు డంప్ చేయబడుతున్న ఖాళీ స్థలాలను గుర్తించారు. ప్లాట్ యజమానులతో సమన్వయం చేసుకోవాలని, తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో దుర్వినియోగాన్ని నిరోధించడానికి మరియు స్థానికంగా పరిశుభ్రమైన మరియు క్రమబద్ధమైన వాతావరణాన్ని నిర్వహించడానికి ప్రభుత్వ బహిరంగ స్థలాలను గుర్తించి అక్కడే చెతత వేయాలని సూచించారు. అనంతరం రామంతాపూర్‌లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ రాజు, పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పల్ భగాయత్‌లో పారిశుధ్య నిర్వహణ పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, డిసి రాజు తదితరులు

**మహిళా సంఘాల తయారీ ఉత్పత్తులకు ప్రోత్సాహం :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా సంఘాలు స్వయం ఉపాధి ద్వారా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను కమిషనర్ శ్రీ టి. వినయ్ క్రిష్ణారెడ్డి స్వయంగా పరిశీలించి అభినందించారు. రామంతాపూర్ నేతాజీనగర్‌లో ప్రియంవద అనే మహిళ ఆరోగ్య ఉత్పత్తులు, హోం రెమిడీస్ తయారు చేసి అందజేస్తున్నారని తెలిపారు. అదే విధంగా హిమాన్షి మహిళా సంఘం సోయా వెన్స్‌తో కొవ్వొత్తుల తయారీ, రాజ రాజేశ్వరి పిండి వంటలు తదితర సంఘాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మహిళలు తమ నైపుణ్యాలను ఉపయోగించి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు.

**మహిళలకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి :**

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పార్కులు మరియు చెరువుల సమీప ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఇందుకు తగిన స్థలాలను గుర్తించి ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇప్పటికే వ్యాపారాలు చేస్తున్న మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలని, ఎంపికైన మహిళా సంఘాలకు గుర్తింపు పొందిన ప్రముఖ సంస్థల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

# ఉప్పల్ సర్కిల్‌లో అధ్వాన్నంగా మారిన ఒపెన్ జిమ్‌లు

## -శిధిలావస్థలో పరికరాలు
## -పట్టించుకోని అధికారులు



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో అధ్వాన్నంగా మారిన ఒపెన్ జిమ్ దృశ్యం.



మున్సిపల్ స్టేడియంలో ఒపెన్ జిమ్‌లో పరికరాలు ఊడిపోయిన దృశ్యం.

**ఉప్పల్, మార్చి 13 ప్రభాతవార్త :** మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యువతీ, యువకులు, వృద్ధులు, మహిళల ఆరోగ్యం, శారీరక దారుఢ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్ పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఒపెన్ జిమ్ ఏర్పా టు చేసిన కొద్ది నెలలకే పలు చోట్ల శిధిలావస్థకు చేరగా వీటి నిర్వహణ అధికారులు గాలికి వదిలివేశారు. ఉప్పల్ సర్కిల్‌లో ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కాంట్రాక్టర్లకు కాసులు కురిపించగా, అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ వీటిపై పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్లో గత మూడేళ్ల క్రితం ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఒపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్‌లో ఒకటి, రెండు చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, రామంతాపూర్ చిన్న చెరువు, హబ్సిగూడ వీర రాజిరెడ్డి పార్కు, ఉప్పల్ డివిజన్‌లో వీటిని ఏర్పాటు చేశారు. స్థానిక కమ్యూనిటీహాల్స్, పబ్లిక్ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయగా, వీటిని ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే శిధిలావస్థకు చేరి తప్పుపట్టిపోతున్నాయి. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో పరికరాల బోల్టులు ఊడిపోయి పనికిరాకుండా పోతున్నాయి. ఉదయం, సాయంత్రం ఎంతో మంది చిన్నారులు, యువతీ, యువకులు వీటిని ఉపయోగించుకుంటుండగా నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రామంతాపూర్ చిన్న చెరువు వద్ద విరిగిపోయి అధ్వాన్నంగా తయారైన ఒపెన్ జిమ్ పరికరాలు దృశ్యం. రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్ పరికరాలను పాడైపోయాయి. దీంతో కొన్ని పరికరాలు వంగిపోయాయి. మరికొన్ని ఊడిపోయాయి. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించు కోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. గత కౌన్సిల్ హయాంలో కూడా పలు చోట్ల కమ్యూనిటి హాల్స్ జిమ్‌లు ఏర్పాటు చేయగా, చాలా చోట్ల పరికరాలు ఎన్ని ఉన్నాయో, ఎన్ని పోయాయో అధికారులకు తెలియకుండా ఉంది. పరికరాల లెక్కలు కూడా అధికారులు వద్ద లేకపోవడం గమన్హారం.

**ఒపెన్ జిమ్‌లనిర్వహణ పట్టని అధికారులు..! :**

ఉప్పల్ సర్కిల్లో ఒపెన్ జిమ్‌లతోపాటు, కమ్యూనిటీహాల్స్ ఏర్పాటు చేసిన జిమ్‌ల నిర్వహణ అధికారులకు పట్టడం లేదు. స్పోర్ట్స్ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా పలు చోట్ల జిమ్‌ల గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చిన సమ యంలో హడావిడి చేయడం, తిరిగి వీటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజరోగ్యంపై నిర్లక్ష్యం చూపుతోంది : సుధీర్ రెడ్డి



కుమ్మరికుంట వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**హయత్ నగర్, మర్చి 13 ప్రభాతవార్త :**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపినట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హయత్ నగర్ లో గుర్రపుడెక్కతో నిండిన కుమ్మరికుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు గుర్రపు డెక్క పెరిగి పోవడం వాళ్ళ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెరువుల్లో గుఱ్ఱపు డెక్క పేరుకు పోకుండా దోమల నివారణకు డ్రోన్లు వినియోగించి మందులు పిచికారీ చేసినట్లు తెలిపారు. దోమల లార్వాను అరికట్టడానికి గంబూజియా జాతికి చెందిన చేప పిల్లలను చెరువులోకి వదిలి దోమల వ్యాప్తిని అరికట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యం పై నిర్లక్ష్యం చూపుతోందాన్నారు. కొందరు కాంగ్రెసు నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ తమ పబ్బం గడుపుతున్నారని మండి పడ్డారు. అని విమర్శించారు. ప్రభుత్వం ఫోర్త్ సిటీ అని గొప్పలు చెప్పుకుంటు ఉన్న సిటీని పరిశుభ్రంగా ఉంచలేక పోతోందాన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. కుమ్మరికుంటలో పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్కను రెండు,మూడు రోజుల్లో తొలగించి చుట్టుపక్కల కాలనీలలో దోమల మందు స్ప్రే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, నాయకులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, గోరిగే ప్రదీప్ పాల్గొన్నారు.

**జిల్లెలగూడ శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం 5,33,888**



హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ గ్రామంలోనున్న పురాతనమైన శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం 86 రోజులకు గాను రూ.5,33,888లు వచ్చింది. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్/ఛైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ ఆదేశాల మేరకు దేవాలయ కార్య నిర్వహణాధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షణాధికారి బి.శ్రీనివాస్, స్థానిక జిల్లెలగూడ మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు చింతపట్ల జ్ఞానేశ్వరచారి, పోరెడ్డి జంగారెడ్డిల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు లెక్కించగా రూ.5,33,888లు వచ్చాయి. అనంతరం ఇఒ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని దేవాలయానికి సంబంధించిన బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు.

# నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్‌లో నాలా పూడ్చివేతపై హైడ్రా విచారణ

-కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు పరిశీలన జరిపిన బృందం
-నివేదిక తయారు చేసి కమిషనర్‌కు అందజేస్తామన్న అధికారులు
-తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ



నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్ కాలనీలో పూడ్చివేతకు గురైన నాలాను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

**సరూర్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్ కాలనీలో పూడ్చివేతకు గురైన వరద నీటి నాలాను శుక్రవారం హైడ్రా అధికారుల బృందం పరిశీలించింది. స్థానికంగా వెంచర్ ఏర్పాటు చేసిన సమయంలో రియల్‌ఎస్టేటర్ నాలాను అక్రమంగా పూడ్చి రోడ్డు వేసి కేవలం మూడు ఫీట్ల మేర ఉన్న పైప్‌లైన్లను ఏర్పాటు చేశారనీ దీని వల్ల వర్షాల సమయంలో కాలనీ ముంపునకు గురవుతూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల కాంగ్రెస్ నాయకులు హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి నాలాను పునరుద్ధరించాలని కోరడంతో స్పందించిన హైడ్రా కమీషనర్ ఆదేశాల మేరకు హైడ్రా ఇరిగేషన్ కన్సల్టెంట్ దేవేందర్‌రెడ్డి, డిఇఇలు అర్చన, నారాయణ, జెఇ వంశీ, ఎస్ఐ ముజాఫర్ అలీ తదితరులు శుక్రవారం గ్రీన్ హోమ్స్ కాలనీని సందర్శించారు. ఈ నేపథ్యంలో నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, బంగారి అశోక్, అంకంగారి వెంకటేశ్‌గౌడ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ తదితరులు హైడ్రా బృందానికి నాలా కబ్జా గురించి వివరించారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రీన్‌హోమ్స్ వెంచర్‌లో నాలా ఉన్న ప్రాంతాన్ని అదే విధంగా పూడ్చివేతకు గురై మారిన రోడ్డును, రియల్టర్ ఏర్పాటు చేసిన భూగర్భ పైపులను పరిశీలించారు. అనంతరం హైడ్రా కన్సల్టెంట్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాలా తాజా పరిస్థితి, స్థితిగతులు తదితర విషయాలకు సంబంధించి పరిశీలించిన దానిపై నివేదిక తయారు చేసి హైడ్రా కమీషనర్‌కు అందజేస్తామని వెల్లడించారు. తదుపరి ఆదేశాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాతం కుమార్ యాదవ్, నాగరాజు, సాయియాదవ్, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బహుళ అంతస్తుల భవనాల్లో ఫైర్ సేఫ్టీ పరికాలు ఏర్పాటు చేసుకోవాలి: డిసి సరస్వతి



ఫైర్ సేఫ్టీ పరికరాల ఏర్పాటు డ్రైవ్‌ను నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ బృందం

**సరూర్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలలో తప్పనిసరిగా అగ్ని ప్రమాద నివారణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ కమీషనర్ పి.సరస్వతి సూచించారు. సర్కిల్ పరిధిలో జరుగుతున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ డిసి సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎం.దినేష్, సిబ్బంది వివిధ ప్రాంతాల్లో భద్రత లేని బహుళ అంతస్తుల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు అగ్ని ప్రమాద నివారణ పరికరాలు లేని వాటిని గుర్తించి భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు డిసి మాట్లాడుతూ అన్ని బహుళ అంతస్తుల భవనాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి మర్చి 13 ప్రభాతవార్త :**

మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఆశా వర్కర్లు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు ఆశా వర్కర్లుగా పనిచేస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలన్నింటి పరిష్కారం కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎన్‌హెచ్ఎమ్‌కు నిధులు పెంచాలని ఆశా వర్కర్లు ఎమ్మెల్యేను కోరారు.అదేవిధంగా వెంకటాపురం డివిజన్‌లోని సుభాష్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం అద్దె భవనంలో పనిచేస్తోందని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వ భవనాలకు మార్చి వస్తే ఇంద్రానగర్ బస్ దవాఖాన లేదా మహిళా మండలికి మార్చాలని కోరారు.ఈ విషయాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెంటనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మరియు డిఎంహెచ్ఓ డా. ఉమా గౌరి దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టర్ తాత్కాలికంగా అదే భవనంలో కొనసాగేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఆశా వర్కర్ల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే, వారి సమస్యలను తప్పనిసరిగా అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ యుబిఎస్‌సి డాక్టర్ నౌరిన్ బేగం, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సభ్యులు ఉన్నికృష్ణన్, ఆశా వర్కర్లు కమల, కళ్యాణి, అమృత, జ్యోతి, వాగ్దేవి, కవిత, రూప, సంతోష, మీరా, సుగుణ, రాధ, రమ్యశ్రీ, ఆర్తి, ధృతి, లక్ష్మీ, రవళి, భవాని, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి : మల్లారెడ్డి



**అత్తాపూర్ మార్చి 13, ప్రభాతవార్త :** హైదర్‌గూడలో నెలకొన్న ప్రజా సమస్యలపై బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి పలువురితో కలిసి బస్తీలో పర్యటించారు.ఈ సందర్భంగా శ్రీ ప్రణవ భక్త సమాజము ఆంజనేయ స్వామి దేవాలయం నుండి కుమ్మరి బస్తి మీదుగా బాదాం చెట్టు నుండి ఇటు రజక బస్తీ మీదుగా పబ్బతి బాలాంజనేయ స్వామి గుడి వరకు డ్రైనేజ్ లైన్‌కు అవుట్ లెట్ చూపించకుండా డ్రైనేజు వాటర్‌ను ఓపెన్ నాలాకు కలిపిన ప్రదేశాన్ని పరిశీలించారు.దీంతో రావుల గండయ్య, రావుల కిష్టయ్య ఇంట్లోకి మరియు సింగాపురం బజరంగ్ రెడ్డి, నవారు శ్రీపాల్ రెడ్డి, బంటు నర్సింగ్ రావు వాళ్ళ ఇళ్లలోకి డ్రైనేజీ వాటర్ రివర్స్ కొడుతున్నాయని వివరించారు. అదేవిధంగా రౌండ్ మ్యాన్ హోల్ కవర్‌లు, నాలుగు మూలల మ్యాన్ హోల్ కవర్స్ పగిలిపోయి పాదచారులకు వాహనదారులకు ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, వయోవృద్ధులకు రహదారి వెంబడి నడుస్తే అందులో పడిపోయే ప్రమాదం ఉన్నదని మరియు దానివలన విపరీతమైన దుర్గంధం వాసన దోమల బెడద ఉందని అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాబాధ విజయ్ కుమార్, కుక్కునూరి కిరణ్ చారి, కే. యశ్వంత్ రెడ్డి, జీ. అఖిలేష్, సింగాపురం భజరంగ్ రెడ్డి, బంటు నర్సింగ్ రావు, చెట్టిగారి రాజ్ కుమార్, కాకు లారం రవీందర్, సింగాపురం శ్రీలత, సన్నీవెల్లి చిట్టి శివరత్నం, రావుల సుశీల, బండమీది నారాయణ, రావుల రాఘవేందర్, సనివెల్లి విఖేష్ రెడ్డి పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ ప్రభుత్వ పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి : రాఘవేందర్‌రెడ్డి



పాఠశాలలో టాయిలెట్లను పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌లోని అల్మాస్‌గూడ ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేయిస్తామనీ పాఠశాల భవనానికి రంగులు వేయించి విద్యార్థుల కోసం ఆధునిక బోధనా పరికరాలు ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. సాంకేతిక కాలానికి అనుగుణంగా డిజిటల్ బోర్డులు, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు అవసరమని ఆయన అన్నారు. పాఠశాల సమస్యలను నియోజకవర్గ ఇంఛార్జి కెఎల్ఆర్, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ బిజెపి రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్‌గా శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త:**

తెలంగాణ బిజెపి రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్‌గా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన కొలన్ శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న శంకర్‌రెడ్డి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బిజెపిలో వివిధ పదవులను నిర్వహించడమే కాకుండా స్వగ్రామం బాలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక రైతు సేవా సహకార సంఘానికి (సింగిల్ విండో) గతంలో ఛైర్మన్‌గా పని చేశారు. అయితే పార్టీలో ఆయన సేవలను గుర్తించిన అధిష్టానవర్గం ఆయనను బిజెపి రాష్ట్ర కో-ఆపరేటివ్ విభాగానికి కన్వీనర్‌గా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాంచందర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసిన శంకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బిజెపి కో-ఆపరేటివ్ విభాగాలను బలోపేతం చేయాలని సూచించారు. జిలాల్లో పర్యటించి సహకార సంఘాలతో అనుబంధం ఉన్న ప్రజలు, రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కాగా తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొండ్రు గౌరీ శంకర్, సిఎన్‌రెడ్డి, ఓబిసి మోర్చా నాయకుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న కొలన్ శంకర్‌రెడ్డి



హఠాన్మరణం చెందిన ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ : పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్‌లో ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 13 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సెవెన్‌హిల్స్ కాలనీలోని అక్సా మసీదులో శుక్రవారం ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మతసామర్యానికి రంజాన్ ప్రతీక అన్నారు. కుల, మతాలకు అతీతంగా రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి రంజాన్ కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సుంకు శేఖర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, అమర్, సత్యం, ప్రేమ్ గౌడ్, ప్రణయ్ యాదవ్, తుమ్మల దేవిరెడ్డి, కమిటి అధ్యక్షులు ఆఫ్జల్, అబ్దుల్ సత్తార్, ఖాదర్ బాషా, బాషా, ఖాదర్ వలి, సలీమ్, ఖలీల్ పాల్గొన్నారు.